## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన 'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సాప్ ద్వారా పంపగలరు



# తొలి ఆకాంక్ష

TGTEL/25/A1964

akankshanews.com

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను

పాఠకులకు అండగా, ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, ఖమ్మం, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ, నిర్మల్, నారాయణపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి, హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు / మండల / నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number : 9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 89 ఎడిటర్ :పెనుగొండ సతీష్ బుధవారం 12 నవంబర్ 2025 పేజీలు 8 వెల 5.00




# అశ్రునయనాల మధ్య అందేశ్రీ అంత్యక్రియలు

- పాడెమోసి ప్రేమ చాటుకున్న సిఎం రేవంత్
- హాజరైన పలువురు నేతలు... మంత్రులు... కళాకారులు...
- పోలీసుల గౌరవ వందనం మధ్య అంత్యక్రియలు పూర్తి
- అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం
- ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా
- పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాసా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 11 : అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మంగళవారం ఉద యం అందెశ్రీ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్



బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ పార్థివ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న

2లో

### బాంబు దాడి

# నిందితులను వదలబోం

- భూటాన్ పర్యటనలో ప్రధాని మోడీ హెచ్చరిక
- బాధాతప్త హృదయంతో ఇక్కడికి వచ్చానని వెల్లడి



(ఆకాంక్ష న్యూస్)


న్యూఢిల్లీ, నవంబర్ 11 : ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో

2లో

### నిందితులను

# కఠినంగా శిక్షిస్తాం

- దర్యాప్తు సంస్థలు వేగంగా పనిచేస్తున్నాయి
- కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, నవంబర్ 11 : ఢిల్లీలోని ఎర్రకోట కారు పేలుడు ఘటనపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. పేలుడు ఘటనపై భద్రతా, దర్యాప్తు సంస్థలు సమగ్ర విచారణ చేస్తున్నాయని, నిందితులను కఠినంగా శిక్షిస్తాం అని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు. ఈ చర్యను శాంతికి భంగం కలిగించే పిరికి ప్రయత్నంగా పేర్కొన్నారు. ఢిల్లీలో మంగళవారం మీడియా సమావేశంలో రక్షణ శాఖ మంత్రి మాట్లాడారు. 'ఎర్రకోట

2లో

### జూబ్లీహిల్స్‌లో

# కాంగ్రెస్‌దే హవా

- అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోనూ కాంగ్రెస్‌కే మొగ్గు



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 11 : తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదనేదానిపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలా ఉన్నాయి. వివిధ సర్వేల ఆధారంగా అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయింది. అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ముందంజలో ఉండగా బిఆర్ఎస్ రెండోస్థానంలో ఉంది. ఇక బిజెపి అతి

2లో

# జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్

- సాయంత్రం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదు
- క్యూ లైన్‌లో ఉన్న వారికి ఓటేసే అవకాశం
- షేక్‌పేట డివిజన్‌లో పోలీసుల లాఠీఛార్జి
- పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు



(ఆకాంక్ష న్యూస్)


హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. గత పక్షం రోజులుగా హోరాహోరీ ప్రచారం చేసి, ఓట్లను అర్థించిన ఓటర్లు పెద్దగా స్పందించ లేదు. ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ పక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పోలింగ్ సమయం ముగిసే నాటికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. యూసుఫ్‌గూడ మహబూబ్ ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓట్ల విషయంలో నిలదీసిన

2లో

### ఢిల్లీ బాంబు పేలుడుతో

# కేంద్రం అప్రమత్తం

- విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ అమలు
- ప్రధాన నగరాల్లో నిఘా కట్టుదిట్టం



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, నవంబర్ 11 : దేశ రాజధాని ఢిల్లీ బాంబు పేలుడుతో కేంద్రం అప్రమత్తమైంది. ఈ మేరకు దేశంలో హైఅలర్ట్ ప్రకటించింది. ఢిల్లీ సహా ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్, బీహార్ సహా పలు రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించింది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, జైపూర్ వంటి ప్రధాన నగరాల్లో భద్రతా దళాలు నిఘాను పెంచాయి. అంతేకాదు దేశంలోని అన్ని విమా నాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మూడు రోజుల పాటూ విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ కొనసాగనుంది. ప్రతి ఒక్క ప్రయాణికుడినీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కేంద్రం

2లో

### బీహార్‌లో ముగిసిన

# రెండోదశ పోలింగ్

- అత్యధికంగా 67.14శాతం ఓటు హక్కు వినియోగం
- ఓటేసిన దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు
- కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్



(ఆకాంక్ష న్యూస్)

పాట్నా, నవంబర్ 11 : బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని

2లో

### సునీత వ్యాఖ్యలు

# సత్యదూరం

- సానుభూతి పొందే ప్రయత్నం
- తిప్పికొట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రశాంతం గా కొనసాగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి 40.20 శాతం నమోదయ్యింది. తమను పోలింగ్ స్టేషన్ల దగ్గరకు రాకుండా అడ్డుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆరోపించారు. ఈ క్రమంలో సునీత వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాజకీయ సానుభూతి ప్రకటనలు కురిపిస్తున్నారని అన్నారు. సునీత వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంగించినట్లేనని అన్నారు పొన్నం. ఓటమి భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు పొన్నం. ప్రజలు తమ ఇష్టానుసారం ఓటు వేసే హక్కు ఉందని.. పోలింగ్ టైంలో స్థానికేతర నేతలు ఉంటే కేసు పెట్టాలని అన్నారు. అయితే.. ఉదయం పోలింగ్ కాస్త నెమ్మదిగా జరిగినా.. గంట గంటకి నెమ్మదిగా ఓటింగ్ శాతం పెరుగుతోంది. మధ్యాహ్నం వచ్చే వరకు పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం మూడు గంటల సమయానికి వరకు 40.20 శాతం పోలింగ్ నమోదయ్యిం

2లో

### ఢిల్లీ పేలుడు ఘటనలో

# 12కు చేరిన మృతుల సంఖ్య

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మృతి
- సిసిటివి దృశ్యాల ఆధారంగా కారు గుర్తింపు



(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, నవంబర్ 11 : ఢిల్లీ నగరాన్ని కుదిపేసిన ఎర్రకోట పేలుడు ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద జరిగిన ఈ భయానక పేలుడులో తొలుత 9 మంది అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందుతున్న వారిలో మరో ముగ్గురు ఆసుపత్రిలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 12కు చేరింది. ప్రస్తుతం తీవ్ర గాయాలతో 17 మంది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎర్రకోటకు అతి సమీపంలో కారులో సంభవించిన భారీ పేలుడుతో దేశ రాజధాని నగరం దిల్లీ ఉలిక్కిపడింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది చనిపోయారు. అనేక మంది గాయపడ్డారు. పలువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం దర్యాప్తు సంస్థలు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇక నిందితుడికి సంబంధించిన వీడియోలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ పేలుడుకు కారణమైన ఐ20 కారుకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ కారు నడుపుతోన్న వ్యక్తి డాక్టర్ ఉమర్ మహ్మద్ అని పోలీసులు అనుమానిస్తున్నారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా ఛేదిస్తోన్న ఉగ్ర కుట్రల్లో భాగంగా అరెస్టయిన వారిలోను వైద్యులు ఉండటం కలకలం సృష్టిస్తోంది. ఇప్పటివరకు మంత్రులు, అధికారులు దీనిని ఉగ్ర ఘటనగా పేర్కొన్నప్పటికీ.. చట్టవిరుద్ధ కార్యకలాపాల కింద దర్యాప్తు

2లో

### జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల

# బెదిరింపులు

- మహిళ అని కూడా చూడకుండా హేళన
- ఓటమి భయంతోనే ఆగడాలకు దిగారన్న సునీత



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, నవంబర్ 11 : జూబ్లీహిల్స్‌లో ఓటర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించారని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని బెదిరింపులకు దిగుతూ మాట వినకపోతే బూతులు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ అభ్యర్థి అని

2లో



# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

మొదటిపేజీ తరువాయి

సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఆప్తుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తి శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను.. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీని కలిసినప్పుడల్లా సొంత అన్నను కలిసినట్టుగా ఉండేదన్నారు. గద్దర్ తో పాటు అందెశ్రీ పాటు తెలంగాణ ఉద్యమానికి ఎంతో బలాన్ని ఇచ్చాయని అన్నారు. అందెశ్రీ జయజయహే పాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందని.. అందుకే జయజయహే పాటను రాష్ట్ర గీతంగా గుర్తించామని తెలిపారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందెశ్రీ వ్యక్తిగతంగా తన మనసుకి దగ్గరి వ్యక్తి అని.. ఆయన లేని లోటు నా కుటుంబానికి వ్యక్తిగతంగా తీరని లోటన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని కానీ అవార్డు రాలేదన్నారు. ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని.. ఆయనకు పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

# ఢిల్లీ పేలుడు ఘటనలో 12కు చేరిన మృతుల సంఖ్య

మొదటిపేజీ తరువాయి

చేస్తున్నారు. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు. అయితే భయంతో ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడా..? అనే కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది. నిషేధిత జైషే మహ్మద్, అన్సార్ గజ్‌వత్ ఉల్ హింద్ ఉగ్ర సంస్థలతో సంబంధం ఉన్న 8 మందిని అరెస్టు చేసినట్లు సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. వీరిలో ముగ్గురు వైద్యులు అదీల్ అహ్మద్, ముజమ్మిల్ షకీల్, షాహిన్ ఉన్నారు. వారిలోని మహిళా డాక్టర్ షాహిన్ సోమవారం లఖ్‌నవూలో అరెస్టు కాగా ఆమె కారు నుంచి ఏకే-47 రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కశ్మీర్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, కేంద్ర ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్ సహా సల్ఫర్‌తో కూడిన 2,900 కిలోల పేలుడు పదార్థాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు తెలిపారు. మరోపక్క గుజరాత్‌లో భారీ ఉగ్ర కుట్రకు ప్రయత్నించిన సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్‌తో పాటు మరో ఇద్దరు ఐసిస్ సానుభూతిపరులను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ కూడా ఒక డాక్టర్ కావడం గమనార్హం. ఈ పరిణామాల వేళ ఉమర్ ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తన సహచరుల అరెస్ట్, బాంబు తయారీలో వాడే పేలుడు పదార్థాల స్వాధీనంతో నిరాశ చెందిన అతడు ఈ పేలుడు పాల్పడి ఉండొచ్చన్న కోణాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఘటనపై దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. పేలుడుకు పాల్పడినట్టు అనుమానిస్తున్న డాక్టర్ ఉమర్ మహమ్మద్ కుటుంబ సభ్యులు సహా ఆరుగురిని జమ్మూ కాశ్మీర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో ఉమర్ తల్లి షమీనా భానో, సోదరులు ఆషిక్ అహ్మద్, జాహ్ అహ్మద్, అలాగే ప్లంబర్ అమిర్ రషీద్, ప్రభుత్వ ఉద్యోగి అమీర్ రషీద్ మీర్, బ్యాంకు సెక్యూరిటీ గార్డ్ తారీఖ్ మాలిక్ ఉన్నారు. పోలీసుల సమాచారం ప్రకారం ఫరీదాబాద్ ఆయుధాల కేసులో పరారీలో ఉన్న ఉమర్ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉండి, ఈ ఆత్మాహుతి దాడికి పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీల ద్వారా కారు కదలికలను పోలీసులు గుర్తించారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

మొదటిపేజీ తరువాయి

తక్కువ ఓట్ల శాతంతో మూడో స్థానంలో ఉంది. చాణక్య స్ట్రాటజీస్ కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి 43 శాతం, బిజెపి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే.. కాంగ్రెస్‌కు 48.3శాతం, భారత రాష్ట్ర సమితికి 43.18శాతం, భాజపాకు 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని పేర్కొంది. స్మార్ట్ పోల్ సర్వే .. కాంగ్రెస్‌కు 48.2 శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, భాజపాకు 7.6 శాతం, ఇతరులకు 2.1శాతం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది. మొత్తంగా అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ఋుదక్యం కనిపించింది. దీంతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. భారత రాష్ట్ర సమితి తరఫున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, భాజపా తరఫున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఎన్నికనుఅధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.

# సునీత వ్యాఖ్యలు సత్యదూరం

మొదటిపేజీ తరువాయి

ది. చివరి రెండు గంటల్లో సాయంత్రం 4 నుంచి 6 వరకు పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారుల అంచనా వేస్తున్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతోంది. నియోజకవర్గంలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉండగా.. 58 మంది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జూబ్లీహిల్స్ లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు.

# నిందితులను కఠినంగా శిక్షిస్తాం

మొదటిపేజీ తరువాయి

కారు పేలుడు ఘటనపై దేశంలోని భద్రతా, దర్యాప్తు సంస్థలు సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నాయి. దర్యాప్తు వివరాలు త్వరలోనే వెల్లడిస్తాము. నా దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడుకు బాధ్యులను వదిలిపెట్టం. నిందితులను కఠినంగా శిక్షిస్తాం. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేస్తుంది' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీతో సహా పలు ఏజెన్సీలు దర్యాప్తులో భాగం కానున్నాయి. దిల్లీ పేలుడు ఘటనపై దేశంలోని దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని.. త్వరలో ప్రమాదానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. దాడికి కారణమైనవారిని వదిలిపెట్టమనికఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ఇదిలా ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన మంగళవారం కీలక సమావేశం జరుగుతోంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యాలయంలో ఈ భేటీ ప్రారంభమైంది. హోం కార్యదర్శి గోవింద్ మోహన్, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్ డీజీపీ, కేంద్ర పాలిత ప్రాంతం ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఢిల్లీ పేలుడిపై ప్రాథమికంగా అందినసమాచారం, ఉగ్ర సంస్థల ప్రమేయం, భారీ కుట్రపై సమీక్షిస్తున్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల బెదిరింపులు

మొదటిపేజీ తరువాయి

చూడకుండా బూతులు మాట్లాడతారా అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న రౌడీయిజం భరించలేక మాగంటి సునీత ఉద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ గూండాల బెదిరింపులకు ఓటర్లు భయపడవద్దని సూచించారు. విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని మాగంటి సునీత అన్నారు. స్టేట్‌లో ఉన్న ఆకు రౌడీలంతా జూబ్లీహిల్స్‌లో తిరుగుతున్నారని తెలిపారు. సురేశ్ యాదవ్ అనే వ్యక్తి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జూబ్లీహిల్స్‌లో ఏం పని అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తిరగాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ ఏజెంట్లు కూర్చుంటే వాళ్లను కూర్చోనివ్వడం లేదని తెలిపారు.పోలింగ్ బూతుల్లోని టేబుళ్లను బయట పడేస్తున్నారని తెలిపారు. పోలీసులు వారి దగ్గరి టేబుల్స్, చైర్లు లాక్కొని దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. బిర్యానీల్లో డబ్బులు పెట్టి ఓటర్లకు ఇస్తున్నారని చెప్పారు. బిర్యానీ ప్యాకెట్లను చూసి కూడా పోలీసులు వదిలేస్తున్నారని తెలిపారు. కొన్ని బూత్‌ల్లో రిగ్గింగ్ చేస్తున్నారని ఆరోపించారు. వికలాంగులకు వీల్‌చైర్స్ కూడా సరిపడేంతగా పెట్టలేదని తెలిపారు. రజియా అనే అమ్మాయి ఇంటికి వెళ్లి దాడులకు దిగుతున్నారని అన్నారు. ఓటింగ్‌కు ఇంకా నాలుగు గంటల సమయం ఉండగా.. దయచేసి ప్రజలంతా బయటకొచ్చి ఓట్లు వేయాలని మాగంటి సునీత కోరారు. జూబ్లీహిల్స్ ఓటర్లు చైతన్యం ప్రదర్శించి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని రౌడీరాజ్యంగా మార్చేశారని తెలిపారు. నవీన్ యాదవ్ మనుషులు వచ్చి రేపు నీ సంగతి చెప్తానని నన్నే బెదిరించారని పేర్కొన్నారు. ఇలాంటి రౌడీ రాజ్యాన్ని అడ్డుకోవాలంటే కేసీఆర్ పార్టీని గెలిపించాలని కోరారు. నా భర్త మాగంటి గోపీనాథ్ ఎన్నో ఎన్నికల్లో పోటీ చేశాడు.. కానీ ఇంత దౌర్జన్యం ఎప్పుడూ చూడలేదని సునీత అన్నారు. 13వ తేదీవరకు ఎన్ని కుట్రలు చేస్తారో చేయండి.. 14వ తేదీ తర్వాత నేను గెలిచాక అందరి సంగతి చెబుతానని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ప్రజలందరికీ బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

## బీహార్‌లో ముగిసిన రెండోదశ పోలింగ్

మొదటిపేజీ తరువాయి

ప్రకటించారు. 20 జిల్లాల పరిధిలోని 122 సీట్లకు మంగళవారం పోలింగ్ జరిగింది. ఈ విడతలో 3.7కోట్ల మంది ఓటర్లకు గాను.. పోలింగ్ సమయం ముగిసే సమయానికి అత్యధికంగా 67.14శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి విడతలోనూ రికార్డు స్థాయిలో 65.9శాతం పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఈసారి అత్యధిక పోలింగ్ నమోదైనట్లు తెలుస్తోంది. దాదాపు 1.75 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు 67.14 శాతం పోలింగ్ నమోదు అయింది. కృష్ణగంజ్‌లో అత్యధికంగా 76.2 శాతం పోలింగ్ నమోదు అయింది. కతిహార్‌లో 75.23 శాతం, పూర్ణిమలో 73.79 శాతం, సుపౌల్‌లో 70.69 శాతం, పూర్వీ చంపారణ్‌లో 69.31 శాతం పోలింగ్ నమోదు అయింది. కొన్ని ప్రాంతాల్లో అత్యల్ప పోలింగ్ శాతం నమోదు అయింది. నవాడలో 57.11 శాతం, రోహ్తాస్‌లో 60.69 శాతం, మధుబణిలో 61.79 శాతం, అర్వాల్‌లో 63.06 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇక, ఎన్నికలు జరిగిన 122 స్థానాల్లో వివిధ ప్రధాన పార్టీల నేతలతో సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 2000లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 62.57శాతం నమోదు కాగా.. ఇప్పటివరకు ఇదే గరిష్ఠం. లోక్‌సభ ఎన్నికల విషయానికొస్తే.. 1998లో అత్యధికంగా 64.6శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఢిల్లీ బాంబు పేలుడుతో కేంద్రం అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

ఆదేశించింది. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ పార్కింగ్‌పైనా దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం ఆదేశాలతో అన్ని రాష్ట్రాల్లోని అధికారులు అప్రమత్తమయ్యారు. ఎయిర్‌పోర్ట్స్ మాత్రమే కాకుండా బస్టాండ్స్, ప్రభుత్వ కార్యాలయాలూ, రద్దీ ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు దేశ సరిహద్దుల్లోనూ హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశరాజధాని ఢిల్లీలో హై అలర్ట్ కొనసాగుతోంది. చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలోని మెట్రో స్టేషన్ దగ్గర ఉన్న సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 9 మంది దుర్మరణం పాలవ్వగా, 20 మందికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ స్టేషన్లు, ఎయిర్‌పోర్ట్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన మార్కెట్లలో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు తాజా ఘటనతో లాల్ ఖిలా మెట్రో స్టేషన్ ను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా లాల్ ఖిలా మెట్రో స్టేషన్‌ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. మరోవైపు దాడి ఘటనపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్, ఎన్‌సీజీ, ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మెట్రో స్టేషన్ సమీపంలోని సీసీటీవీ దృష్యాలను పరిశీలిస్తున్నారు.

# బాంబు దాడి నిందితులను వదలబోం

మొదటిపేజీ తరువాయి

ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలిచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోడీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దు:ఖాన్ని అర్థం చేసుకున్నాం. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు సూత్రధారులను విడిచిపెట్టబోం. కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం. ఇప్పటికే ఉగ్ర కుట్ర మూలాలను గుర్తించాం. ఢిల్లీ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాం. పేలుడుపై అర్ధరాత్రి వరకు సమీక్షలు చేస్తూనే ఉన్నాం. బాధితుల వెంట దేశమంతా ఉందని మోడీ తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోడీ మంగళవారం ఉదయం భూటాన్ వెళ్లారు. పర్యటన ముగించుకుని బుధవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5:30 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# జూబ్లీహిల్స్‌లో ముగిసిన పోలింగ్

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. ఇరు పార్టీల నేతలకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా పోలింగ్ దాదాపు 50 శాతం వరకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మాత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా షేక్‌పేట డివిజన్ లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పోలీసులు రంగంలోకి దిగి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. అక్కడ పోలింగ్ బూత్‌లు 4, 5, 6, 7, 8 వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. వాళ్లు హడావిడి చేయడంతో పోలీసులు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు.. కానీ, గులాబీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. పలువురు కార్యకర్తలను బూత్ ఏరియాస్ నుంచి చెదరగొట్టడానికి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఉద్రిక్తత వెనుక నాన్-లోకల్స్ ఇష్యూ ఉంది.. ఎన్నికల నిబంధనల ప్రకారం నాన్-లోకల్స్ నియోజకవర్గంలో తిరగకూడదు. అయినప్పటికీ, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు బూత్‌ల వద్దకు వచ్చి హడావిడి చేస్తూ? ఓటర్లను ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ జరగడంతో పోలీసులు ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయాల్సి వచ్చింది. ఒకవైపు ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా సాగుతుంటే? మరోవైపు బస్తీలలో ఓటర్లను డబ్బులతో ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డబ్బులు అందకపోవడం వల్ల కూడా ఓటర్లు ఓటింగ్‌కు రావట్లేదని ఓపెన్‌గా మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇదిలావుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విధానంలో ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళిని గౌరవించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సందర్శకులకు ఎర్రకోట మూసివేత

మొదటిపేజీ తరువాయి

స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం నైట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ మహమ్మద్ పేలుడుకు ముందు తన కారును ఎర్రకోట పార్కింగ్ ఏరియాలో సుమారు మూడు గంటల పాటు పార్కింగ్ చేశాడు. పేలుడు విచారణ చేపడుతున్న పోలీసులు.. పుల్వామాలో ఉన్న డాక్టర్ ఉమర్ ఫ్యామిలీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో లింకున్న నలుగుర్ని ఇప్పటి వరకు అరెస్టు చేశారు. రెడ్‌ఫోర్ట్ మెట్రో స్టేషన్‌ను కూడా మూసివేశారు.

# నిజామాబాద్ ఆస్పత్రిలో దారుణం

మొదటిపేజీ తరువాయి

చికిత్స పొందుతూ ఆమె చనిపో యింది. ఆసుపత్రి సిబ్బంది బంగారం అపహరించారని పోలీసు లకు బంధువులు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఎవరు ఆ బంగారం దొంగిలించారనే విషయం తెలియలేదు. వృద్ధురాలి ఒంటిపై ఉన్న 18 గ్రాముల బంగారం కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో లొల్లిలొల్లి చేశారు. పోలీసులు ఆసుపత్రికి వచ్చి గంగవ్వ కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బంగారం మాయం చేసిందెవరో తేలేదాకా గంగవ్వ డెడ్ బాడీని అక్కడ నుంచి తీసుకెళ్లేది లేదని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు తెగేసి చెప్పారు. ఈ ఘటన నిజామాబాద్ టౌన్‌లో హాట్ టాపిక్ అయింది.




# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలంగాణ ఉద్యమకారులు

ఓదెల.నవంబర్ 11(ఆకాంక్ష) : ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన సీనియర్ ఉద్యమకారుడు "తెలంగాణ గీతం" రచయిత అందె శ్రీ అకాల మరణం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా విషాదం నెలకొంది. ఈ సందర్భంగా సోమవారం రోజు హైదరాబాదులో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ ఉద్యమకారులు ప్రశంసించారు.ఓదెల మండలం కొలనూరు రైల్వే గేట్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ గుండెటి ఐలయ్య యాదవ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యమకారులు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ, "తెలంగాణ సమాజం కోసం నిరంతరం పోరాడిన కవులు, కళాకారులు, ఉద్యమకారులు చేసిన త్యాగాలు వెలకట్టలేనివి. అటువంటి వారిని గుర్తించి ప్రభుత్వ లాంఛనాలతో గౌరవించడం తెలంగాణ ఆత్మకు సమాధానాన్ని ఇస్తుంది" అని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక స్థానం కల్పించడం, అందె శ్రీ కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉద్యమకారుల మరణాన్ని పట్టించుకోలేదని, అయితే రేవంత్ రెడ్డి నిజమైన తెలంగాణ భావజాలానికి ప్రతినిధిగా నిలిచారని ఉద్యమకారులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కందుల సదాశివ్, కుంచం మల్లయ్య, కర్ర లక్ష్మారెడ్డి, పల్లపు కొమురయ్య, బొమ్మ కంటిరవి, దేవుడి రాజిరెడ్డి, బండారి చంద్రయ్య, కనుకుంట్ల కనకయ్య, కలవని మహేష్, మేరా శంకరయ్య, కర్క మోహన్ రెడ్డి, సదాకర్ రెడ్డి, గాజుల శివశంకర్, తుంగాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నేడు గోదావరి మహా హారతి

## - గోదావరి తీరం వద్ద సన్నాహాలు పూర్తిచేసిన నిర్వాహకులు



గోదావరిఖని,నవంబర్ 11(ఆకాంక్ష) : గోదావరి నదీ తీరాన సమ్మక్క సారలమ్మ జాతర స్థలం వద్ద బుధవారం నిర్వహించనున్న మహా హారతి కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి ఖ్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రతినిధులు సాయంత్రం హారతి వేదిక ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఖ్యాతం వెంకటరమణ మాట్లాడుతూ, "గత 14 సంవత్సరాలుగా గోదావరి తీరాన లోకకల్యాణార్థం మహా హారతిని నిర్వహిస్తున్నాం. ఈసారి కూడా భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందాలని కోరుతున్నాం" అని తెలిపారు.హారతి ఉత్సవ సమితి వివరాల ప్రకారం, ఈసారి రెండు వేదికలను ఏర్పాటు చేశారు. ఒకటి సభా వేదికగా, మరొకటి హారతి వేదికగా ఉండనుంది. గోదావరి నదీమాతకు వేదపండితులచే నక్షత్ర హారతి, కుంభ హారతి, కర్పూర హారతి, ధూప హారతి వంటి ప్రత్యేక హారతులు సమర్పించనున్నారు.అదేవిధంగా గుమ్మడి లావణ్య కళాబృందం ఆధ్వర్యంలో భరతనాట్యం నృత్య ప్రదర్శనలు కూడా భక్తులను అలరిస్తాయి. సాయంత్రం ప్రారంభమయ్యే మహా హారతికి ప్రాంతం నలుమూలల నుండి భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తాటిపల్లి వెంకన్న, గుండా మంజుల, అంశాల వీరేశం, గుండా రమేష్, శ్రావణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరై గోదావరి మాత ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# బోనస్ ఊసే లేని కొనుగోళ్లు - అయోమయంలో అన్నదాతలు

ఓదెల. నవంబర్ 11(ఆకాంక్ష) : ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మాటలు ఇప్పటికీ గాలిలో కలిసిపోయాయని యాసంగి వడ్లకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పటికీ ఆ హామీని నెరవేర్చకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరాశ వ్యాపించిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సన్న వడ్ల కొనుగోళ్లు మొదలైనప్పటికీ బోనస్ ఇవ్వాలనే విషయంపై ప్రభుత్వం మౌనం పాటించడం రైతుల మనసుల్లో అనుమానాలు కలిగిస్తోందని పేర్కొంటున్నారు.గత యాసంగిలో ఇచ్చిన బోనస్ ఇప్పటికీ రాలేదు. ఈ సారి ఇచ్చే నమ్మకం ఎక్కడుంది?" అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇవ్వాలా, లేక బియ్యం పట్టి తెలిసిన వ్యాపారులకు అమ్మాలా అనే అయోమయం ప్రతి గ్రామంలోనూ కనిపిస్తోంది. "సరే బియ్యం పట్టిచ్చి తెలిసినవాళ్లకు అమ్ముదామా?"అంటే కూడా "యెగజల్లి ఏరుకున్నట్టే అవుతుందేమో'' అన్న అనుమానం రైతుల హృదయాల్లో తారసపడుతోంది. మొన్నటి మొంథా తుఫాన్ రైతులను నిండా ముంచేసిన సంగతి అందరికీ తెలిసిందే. పొలాలు నేలమట్టమయ్యి, హార్వెస్టర్లు కూడా బురదలో కదల్లేని స్థితిలో ఉన్నాయి. "ఎకరం వరి కోసి ఒడ్డుకు తీసుకొచ్చే సరికి లాభం కంటే నష్టం ఎక్కువగా కనిపించింది" అంటూ రైతులు వాపోతున్నారు. పంట పూర్తిగా కోయకుండానే వదిలేయాల్సి వచ్చిన దయనీయ పరిస్థితి ప్రస్తుత రైతు దుస్థితిని అద్దం పడుతోంది.ఈ పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య "సన్న వడ్లను ఎక్కడ అమ్ముకోవాలి?" అన్నదే. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ నమ్మకం కోల్పోయిన రైతులు ఇప్పుడు రెండు మధ్యలో ఇరుక్కున్నారు. బియ్యంగా మార్చిఅమ్మాలంటే మార్కెట్ లో డిమాండ్ లేదు. ప్రభుత్వానికి ఇవ్వాలంటే బోనస్ రాకపోవచ్చన్న భయం వెంటాడుతోంది. గత వానాకాలం సీజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇచ్చి, యాసంగి సీజన్‌లో మాత్రం ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. "ఒక్క సీజన్‌లో మురిపించిన బోనస్ నేడు అందని ద్రాక్ష అయింది" అని రైతులు చెబుతున్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన బోనస్ మాట, నేడు రైతుల కళ్లలో నిరాశగా మారింది.పల్లెల్లో నేడు చర్చ ఏదంటే అదే "బోనస్ వస్తుందా? రాదా?" అన్నదే. రైతులు రచ్చబండ కింద కూర్చుని, "ప్రభుత్వం మీద నమ్మకం లేదు" అంటూ బహిరంగంగానే చెప్పేస్తున్నారు. "రైతు భరోసా ఇవ్వకుంటే ఏం చేసినం? రుణమాఫీ ఎగబెడితే ఏం చేసినం? బోనస్ బోగస్ చేస్తే ఏం చేసినం?" అంటూ వేదన వ్యక్తం చేస్తున్నారు.మొంథా తుఫాన్ నష్టాలు, యూరియా కొరత, కోత ఖర్చులు – ఇవన్నీ రైతులనడుమ మింగలేని భారం అయ్యాయి. అయినా చివరి ధాన్యాన్ని చేతికందించుకొని, దానికి సరైన ధర దొరకాలనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.మునిగితే మునుగుతం, తేలితే తేలుతం" అంటూ కొంతమంది రైతులు నిరాశతో స్పందిస్తున్నారు. ''ఆత్మకూర్, కంఠాత్మకూర్ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముదాం'' అంటూ కొంతమంది నిర్ణయానికి వస్తున్నారు. ఏదేమైనా, ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల నమ్మకాన్ని నిలబెట్టేలా, గత యాసంగి సీజన్‌తో కలిపి ప్రస్తుత సీజన్‌లో విక్రయించే సన్నధాన్యానికి బోనస్‌ను నమ్మకంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# అమ్మవారి భవ్య ఆలయాన్ని అదే ప్రదేశంలో నిర్మించాలి

## - రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి డిమాండ్





గోదావరిఖని.నవంబర్ 11(ఆకాంక్ష) : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని సోలార్ ప్లాంట్ సమీపంలో వాటర్ స్టోరేజ్ నిర్మాణ పనుల సందర్భంగా వెలుగులోకి వచ్చిన పురాతన అమ్మవారి విగ్రహం వివాదంగా మారింది. హిందూ వాహిని కార్యకర్తల సమాచారం మేరకు బీజేపీ రామగుండం ఇంచార్జ్ శ్రీమతి కందుల సంధ్యారాణి ఘటనా స్థలికి చేరుకుని, హిందూ వాహిని ఆధ్వర్యంలో భక్తిపూర్వకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం %చీూజ% యాజమాన్యం, సంబంధిత కాంట్రాక్టర్ హిందూ మనోభావాలను పక్కనపెట్టి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ లేదా పోలీస్ అధికారులకు తెలియజేయకుండానే అక్రమంగా విగ్రహాన్ని తరలించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చర్యపై తీవ్రంగా స్పందించిన బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మాట్లాడుతూ... హిందూ మనోభావాలు, విశ్వాసాలను గౌరవించి అమ్మవారి భవ్య మందిరాన్ని అదే ప్రదేశంలో నిర్మించాలి. పురాతన విగ్రహం వెలిసిన ఈ ప్రదేశం పవిత్రమైనది. దానిని తక్కువచేసే చర్యలు అంగీకారయోగ్యం కావని తెలిపారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఏర్పాటులో ఎన్టిపిసి కంపెనీ ప్రారంభ దశలో అనేక గ్రామాల ప్రజలు తమ భూములను త్యాగం చేశారు. ఆ క్రమంలో అనేక ఆలయాలు, చెరువులు, పుణ్యక్షేత్రాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన అమ్మవారి విగ్రహం మళ్లీ ఆ పుణ్యభూమి ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. కాబట్టి వెంటనే ఆ ప్రదేశంలో అమ్మవారి ఆలయం నిర్మించి భక్తుల మనోభావాలను గౌరవించాలని" ఎన్టిపిసికి డిమాండ్ చేశారు.ఎన్టిపిసి యాజమాన్యం హిందూ విశ్వాసాలను గౌరవించాలి. భక్తుల హృదయాలను దెబ్బతీసే చర్యలు తగవు. అమ్మవారి ఆలయం నిర్మాణం ద్వారా భక్తి, విశ్వాసాలకు గౌరవం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్, హిందూ సంఘాల నాయకులు గాండ్ల ధర్మపురి, ఇస్సంపెల్లి వెంకన్న, బండ సమ్మన్న, తన్నీరు రాకేష్, కాంతాల సంతోష్ రెడ్డి, అవాడ శ్రీకాంత్, ఈదునూరి వెంకటేష్, మేకల సదానందం, కొండపర్తి సంజీవ్ కుమార్, ఈదుమారి చిరంజీవి, ఆరెందుల రవీందర్, పల్లె వంశీ, హనుమాండ్ల వెంకటేష్, సాహు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# అప్పన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

పెద్దపల్లిటౌన్.నవంబర్ 11(ఆకాంక్ష) : పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట సింగిల్ విండో పరిధిలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్ ప్రధాన అతిథిగా పాల్గొని పంటల కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్య గింజకు సరైన మద్దతు ధర అందేలా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సింగిల్ విండో ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దళారుల మోసపూరిత పద్ధతులకు లొంగకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించాలని ఆయన రైతులను కోరారు. రైతుల శ్రమ వృథా కాకుండా మద్దతు ధర ద్వారా ఆర్థిక బలాన్ని పొందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.రైతుల సౌకర్యార్థం సబ్బితం, కుర్మపల్లి, బొంపల్లి, మేరపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సకాలంలో ధాన్యం కొనుగోలు జరగేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఈవో గడ్డి తిరుపతి, డైరెక్టర్లు గండు వెంకన్న పటేల్, కొత్త వెంకటమ్మ, నాయకులు చంద శంకర్, అరికిల్ల లక్ష్మయ్య, గుర్రాల వీరేశం, గుర్రాల రాజు, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఓదెల మండలంలోని కొలనూరులో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

## - ఢిల్లీలో బాంబు పేలుళ్లకు బీజేపీ నేతల ఆగ్రహం



ఓదెల నవంబర్ 11(ఆకాంక్ష) : దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న బాంబు పేలుళ్ల ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిరపరాధ ప్రజల ప్రాణాలను బలి తీసుకున్న ఈ ఉగ్రవాద చర్యలను ఖండిస్తూ, పెద్దపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకత్వం ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి ఆదేశాల మేరకు, ఓదెల మండలంలోని కొలనూర్ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరి ఉగ్రవాదులను ప్రతీకాత్మకంగా దహనం చేశారు. "దేశ భద్రతకు సవాల్ విసురుతున్న ఉగ్రవాదులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్.మండల ప్రధాన కార్యదర్శి పుల్ల సదయ్య గౌడ్ మాట్లాడుతూ... దేశం శాంతి, అభివృద్ధి మార్గంలో దూసుకెళ్తున్న వేళ, దేశాన్ని అస్థిరపరచే ప్రయత్నం చేసే ఉగ్రవాదులను దేశం క్షమించదు. వీరిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇలాంటి దుర్మార్గపు చర్యలు ప్రజలలో భయాన్ని పుట్టించలేవు. దేశ ప్రజలు ఐక్యంగా నిలిచి ఉగ్రవాదాన్ని తుదముట్టిస్తారు" అన్నారు.ఈ కార్యక్రమంలో కొల్లూరి మధునయ్య, దేవిడి రజనీకర్ రెడ్డి, జంగం రాజు, కరెంగుల నవీన్, జనగామ సాయి కుమార్, శ్రీనివాస్, పురేళ్ల సారయ్య, తోటపెల్లి కుమార్, కొంగరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీ జేఏసీ జిల్లా వైస్ చైర్మన్‌గా కొండి సతీష్ నియామకం

పెద్దపల్లిబ్యూరో.నవంబర్ 11 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వైస్ చైర్మన్‌గా తెలంగాణ ఉద్యమంలో సక్రియంగా పాల్గొన్న ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు కొండి సతీష్ నియమితులయ్యారు. జిల్లా చైర్మన్ దాసరి ఉష ఈమేరకు మంగళవారం అధికారికంగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంలో నూతన వైస్ చైర్మన్ కొండి సతీష్ మాట్లాడుతూ, "బీసీలకు రాజ్యాంగబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల హక్కుల సాధన కోసం బీసీ జేఏసీ చేపట్టిన ఉద్యమాన్ని జిల్లా స్థాయిలో మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.జిల్లాలోని వివిధ బీసీ సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలను ఒక్క వేదికపైకి తీసుకువచ్చి సమిష్టి ఉద్యమం చేపడతామని ఆయన పేర్కొన్నారు. "బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలపడే విధంగా జేఏసీ నిరంతరం కృషి చేస్తుంది. జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న బీసీ వర్గాల ఐక్యతే మా బలం" అని కొండి సతీష్ అన్నారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర బీసీ జేఏసీ నాయకులు ఆర్. కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్, జిల్లా చైర్మన్ దాసరి ఉషకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకంతో పెద్దపల్లి జిల్లాలో బీసీ జేఏసీ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకోనున్నాయని నేతలు అభిప్రాయపడ్డారు.

# గోదావరిఖనిలో బాంబు స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు..





గోదావరిఖని నవంబర్ 11 (ఆకాంక్ష ): ఇటీవల బాంబు పేలుళ్ల నేపథ్యంలో గోదావరిఖని 1 టౌన్ పోలీసులు హై అలర్ట్ చేశారు పట్టణంలో శాంతి భద్రతలు కాపాడేందుకు, అనుమానాస్పద వ్యక్తులు మరియు వస్తువులపై కఠిన నిఘా ఉంచేందుకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గోదావరిఖని పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి రద్దీ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా పట్టణంలోని గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ప్రధాన చౌరస్తా, లక్ష్మీనగర్ బజార్, ఓల్డ్ అశోక్ థియేటర్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపట్టారు.సామాన్య ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిలిపి ఉన్న వాహనాలను కూడా బాంబు స్క్వాడ్ సిబ్బంది సవివరంగా తనిఖీ చేశారు. అనుమానం వచ్చిన సంచులు, బ్యాగులు, బాక్స్‌లను జాగిలాలతో సోదాలు జరిపారు. ప్రతి మూలలో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రమేష్, భూమేష్, అనూషతో పాటు గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పాల్గొన్నాయి. ప్రజల భద్రతే తమ ప్రాధాన్యత అని పోలీసులు వెల్లడించారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మారణకాండతో దేశ అభివృద్ధిని అడ్డుకోలేరు

**- ముష్కరుల ప్రతి కుట్రను మోడీ ప్రభుత్వం తిప్పి కొడుతుంది**

**- ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతి**

**- రామగుండం బిజెపి మహిళా నేత కందుల సంధ్యారాణి**





గోదావరిఖని.నవంబర్11(ఆకాంక్ష) : ఖబర్దార్ ఉగ్రవాదుల్లారా, ఉగ్రవాదం మెడలు వంచి భూస్థాపితం చేస్తాం అని నిన్నటి ఢిల్లీ బాంబ్ బ్లాస్టింగ్ ఘటన నేపథ్యంలో తీవ్రస్థాయిలో ఉగ్రవాదంపై రామగుండం బిజెపి మహిళా నేత కందుల సంధ్యారాణి. కన్నెర్ర చేశారు ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎన్టిపిసి మేడిపల్లి సెంటర్ చౌరస్తాలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మీడియాతో మాట్లాడుతూ...మారణకాండతో,బాంబు దాడులతో, అల్లర్లతో దేశ అభివృద్ధిని అడ్డుకోలేరు అని అన్నారు.ముష్కరుల ప్రతి కుట్రను మోడీ ప్రభుత్వం తిప్పి కొడుతుంది అని అన్నారు. దాడులతో దేశ స్థైర్యాన్ని దెబ్బతీయలేరు అని అన్నారు. పిరికిపంద చర్యలు చేపడుతూ అల్లర్లకు ఆద్యం పోస్తూ, దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించే విధంగా చేస్తున్న ఉగ్రమూకల భరతం శాశ్వతంగా పట్టే రోజులు దగ్గర పడుతున్నాయని అన్నారు. ఢిల్లీ బాంబు దాడి దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది అని ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు అలాగే సంఘటనలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి అని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో గాండ్ల ధర్మపురి, ఎన్టిపిసి మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ కుమార్, ఇదునూరి చిరంజీవి, చిలువేరు అంజి, లింగరాజు, ఈదునూరి శ్రీకాంత్, సాహూ సంతోష్, కాంతాల సంతోష్ రెడ్డి, గోలివాడ శ్రీకాంత్, శివ ఓర్సు, రమేష్, సాయి, కందుకూరి సతీష్, వెంకటేష్, సంపత్, జి శ్రీధర్, మిట్టపల్లి రవి గౌడ్, మేకల నారాయణ, మంథని శివకుమార్, పల్లికొండ తిరుపతి, రాకేష్, సంతోష్, నల్లి నరేష్, ఈదునూరి శంకర్, పల్లికొండ నర్సింగ్ ,మేకల సదానందం, తోట రవి, మందపల్లి శ్రీకాంత్, కుందారపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం యువకుడు.. చైనాలో ఎంబీబీఎస్..

# వైట్ కాలర్ సయ్యద్ "ఉగ్ర ముఖం" ఎన్ని రూపులు మారిందంటే



రంగారెడ్డి జిల్లా/మహేశ్వరం,నవంబర్ 11(ఆకాంక్ష న్యూస్): అతడి పేరు సయ్యద్..వయసు 30 సంవత్సరాలు.. ఖమ్మంలో పుట్టాడు. ఆ తర్వాత ఎంబిబిఎస్ చేయడానికి చైనా దాకా వెళ్ళాడు. చైనాలో ఆ కోర్స్ పూర్తి చేసుకుని ఇండియాకు వచ్చాడు. హైదరాబాదులో టోలిచౌక్ ప్రాంతంలో యునాని వైద్యుడిగా ప్రాక్టీస్ మొదలు పెట్టాడు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన వ్యక్తి.. ఇండియాకు వచ్చిన తర్వాత ఐఎంఏ పెట్టే పరీక్షను రాయాలి. అందులో ఉత్తీర్ణత సాధించాలి. అలా అయితేనే అతడికి ప్రాక్టీస్ చేయడానికి అవకాశం లభిస్తుంది. కానీ సయ్యద్ ప్లాన్ వేరే ఉంది.. వాస్తవానికి ఎంబిబిఎస్ పూర్తి చేసిన వ్యక్తి యునాని ప్రాక్టీస్ చేయడానికి అవకాశం లేదు. కానీ సయ్యద్ అలా కాకుండా టోలిచౌక్ ప్రాంతంలో యునాని వైద్యుడిగా ప్రాక్టీస్ ప్రారంభించాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు కార్వాన్ ప్రాంతంలో శవర్మ సెంటర్ ఏర్పాటు చేశాడు.. అక్కడ ఆ హోటల్ నిర్వహిస్తుండగానే తన మకాం రాజేంద్రనగర్ కు మార్చాడు..రాజేంద్రనగర్ ఏరియాలో రియల్ ఎస్టేట్ ఏజెంట్ గా పనిచేయడం మొదలుపెట్టాడు. భూములు అమ్మడం, కొనడం వంటివి చేశాడు. ఇలా భిన్న రూపాలలో పనులు చేస్తున్న అతడు ఒక్కసారిగా తన అసలు ముఖాన్ని చూపించాడు. కాకపోతే ఈసారి అతడు రాజస్థాన్ రాష్ట్రానికి వెళ్ళాడు.. అతడు అనుకున్నట్టు జరిగితే.. ఈపాటికి మన దేశంలో మారణ హోమం ఒక స్థాయిలో జరిగి ఉండేది. రాజస్థాన్ రాష్ట్రంలో టోల్ ప్లాజా వద్ద అతడికారును పోలీసులు తనిఖీ చేశారు. అందులో కొన్ని రకాల తుపాకులు, తూటాలు పోలీసులకు లభ్యమయ్యాయి. ఆ తర్వాత ఒక క్యాన్ లో నాలుగు లీటర్ల ఆముదం నూనె పోలీసులకు కనిపించింది. వాస్తవానికి ఆముదం నూనె దొరకడం పోలీసులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. దీని గురించి సయ్యద్ ను పోలీసులు ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం చెప్పాడు. ఈ నేపథ్యంలో పోలీసులు తమదైన స్టైల్ లో అతడిని విచారించగా అసలు విషయం చెప్పాడు. ఆముదాన్ని శుద్ధిచేసి రైసిన్ అనే అత్యంత ప్రమాదకరమైన పదార్థాన్ని తయారుచేసి.. దేశంలోని అత్యంత జన సమర్థమైన ప్రాంతాలలో దానిద్వారా బయో వార్ కు రూపకల్పన చేసినట్టు సయ్యద్ అంగీకరించాడు. ఉత్తరప్రదేశ్, ఇతర ప్రాంతాలకు చెందిన యువకులను సయ్యద్ రిక్రూట్ చేసుకున్నాడు. సయ్యద్ కు ఐసీస్ కోరసాన్ ముఠా తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారి సలహాల మేరకు ఆముదపు నూనె నుంచి రైసీన్ అనే విషాన్ని తయారు చేశాడు. పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతానికి వెళ్లి డ్రోన్ ద్వారా రకరకాల పిస్టల్స్, మందు గుండు సామగ్రిని స్వీకరించాడు. అవన్నీ కూడా పాకిస్తాన్ దేశం నుంచి ఇతడికి వచ్చాయి.. పాకిస్తాన్ దేశంలో ఉన్న కొంతమంది ఉగ్రవాదులు మనదేశంలో దారుణాలకు పాల్పడేందుకు సయ్యద్ లాంటి డాక్టర్లను నియమించుకొన్నారు. సయ్యద్ ఎంబిబిఎస్ చదివి యునానీ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు.. ఆ తర్వాత షవర్మ సెంటర్ ఏర్పాటు చేశాడు. చివరికి రియల్ ఎస్టేట్ ఏజెంట్గా మారిపోయాడు. ఇన్ని ముఖాలను అతడు ప్రదర్శించడానికి ప్రధాన కారణం.. ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా ఉండడానికే.. తను అనుకున్నది చేశాడు.. చివరికి పోలీసులకు దొరికిపోయాడు. ఎక్కడో ఖమ్మంలో పుట్టిన అతడు ఇంతటి ప్రయాణం చేశాడు. అయితే ఈ ప్రయాణం అతడి ఎదుగుదలకు తోడ్పడితే బాగుండేది. వినాశనానికి అతడు సిద్ధమయ్యాడు కాబట్టే.. చివరికి పోలీసులకు దొరికిపోయాడు. అతని ఉగ్ర నెట్వర్క్ పోలీసులు చేదించే పనిలో పడ్డారు.

# ప్రతిభకు పునాది వేసిన చటాన్‌పల్లి

# జిల్లా స్థాయి గేమ్స్ ఆరంభం


**- క్రీడాకారుల భవిష్యత్తు కోసం ఏ విధమైన సహాయానికైనా సిద్ధం.**

**- సదర్ శ్రీనివాస్ యాదవ్ ఏసీపీ లక్ష్మి నారాయణ,ఏంఈవో లతో కలసి ప్రారంభించిన ప్రిన్సిపాల్ ప్రీతి.!**



రంగారెడ్డి జిల్లా / షాద్ నగర్, నవంబర్ 11 (ఆకాంక్ష న్యూస్): రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ చటాన్‌పల్లి బాలుర హాస్టల్ ప్రాంగణంలో జిల్లా స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. మహాత్మా జ్యోతిబా ఫూలే సోషల్ వెల్ఫేర్ సౌజన్యంతో మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను ప్రిన్సిపల్ ప్రీతి ఆధ్వర్యంలో ప్రారంభించారు.ప్రధాన అతిథులుగా షాద్నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్‌కుమార్, మండల విద్యా వనరుల అధికారి చంద్రశేఖర్, బీసీ సేన జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీనివాస్ యాదవ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలకు శుభారంభం చేశారు. అనంతరం విద్యార్థులతో ఆకర్షణీయమైన కవాయితు ప్రదర్శనలు నిర్వహించగా,ఏంఈవో సమక్షంలో ప్రిన్సిపల్ ప్రీతిటాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన అతిథులుక్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తాయని, ఆటల్లో గెలుపోటములు సహజమని చెప్పారు. విజేతలుగా నిలిచిన వారు మరింత ముందుకు సాగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా కృషి చేస్తే తదుపరి విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రధాన అతిథిగా పాల్గొన్న బీసీ సేన జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ...క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం నేను ఎల్లప్పుడూ సహాయానికి సిద్ధంగా ఉంటాను. ప్రతిభావంతులైన విద్యార్థులు నన్ను సంప్రదించవచ్చు. ఈ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ ప్రీతి గారిని అభినందిస్తున్నానని అన్నారు. ప్రిన్సిపల్ ప్రీతి మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా 12 కళాశాలలు, 15 పాఠశాలలకు చెందిన 650 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అండర్-14, అండర్-17 కేటగిరీలలో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, అథ్లెటిక్స్, షాట్‌పుట్ తదితర విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపల్స్, శారీరక విద్యాధికారులు (పీడీలు) పాల్గొని విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. క్రీడల ద్వారా జట్టు ఆత్మ, ఆరోగ్యకరమైన పోటీ

# నిషేధిత అంబర్ ప్యాకెట్లను పట్టుకున్న పోలీసులు



జనగామ జిల్లా పాలకుర్తి, నవంబర్ 11 (ఆకాంక్ష న్యూస్): పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో భారీగా తరలిస్తున్న నిషేధిత అంబర్ పాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. వాటి విలువ సుమారు గా 6,70,000/%-% ఉంటుందని అంచనా వేశారు.కారులో తరలిస్తున్న ప్యాకెట్లను పాలకుర్తి చౌరస్తా నుండి వరంగల్ తరలించేందుకు ప్రయత్నిస్తుండగా అనుమానం వచ్చి కారును తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులతో పాటు 13 బస్తాలతో ఉన్న అంబర్ ప్యాకెట్నను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషనుకు తరలించారు.

# డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

# (జాతీయ విద్య దినోత్సవం, మైనార్టీ వెల్ఫేర్ డే) కార్యక్రమం






ములుగు జిల్లా/ఏటూరు నాగారం ,నవంబర్ 11(ఆకాంక్ష న్యూస్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏటూరు నాగారం నందు తేదీ 11.11. 2025.,నాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ వెల్ఫేర్ డే) కార్యక్రమం ను చరిత్ర విభాగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్, డి. నవీన్ అధ్యక్షత వహించి , జాతీయ విద్యా దినోత్సవం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం చరిత్ర విభాగ అధిపతి సి హెచ్. వెంకయ్య గారు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి సేవలను, వారు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ పి జ్యోతి, కనీస్ ఫాతిమా, సంపత్ జీవవేణి, రమేష్ రాజశేఖర్, శ్రీధర్ భావన, భాస్కర్, శ్రీకాంత్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పసుపు రంగు ప్లేట్లకు బదులు తెలుపు రంగు నెంబర్ ప్లేట్ల తో టాక్సీ మోసం

జనగామ టౌన్:నవంబర్:11(ఆకాంక్ష న్యూస్): జనగామ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ వాహనదారులు పసుపు రంగు నెంబర్ ప్లేట్లకు బదులు తెలుపు రంగు నెంబర్ ప్లేట్లు ఉపయోగిస్తూ ప్రయాణికులను తరలిస్తున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్ తీవ్రంగా విమర్శించారు ఈ చర్యలు చట్ట విరుద్ధమని ప్రమాదాల సమయంలో ప్రయాణికులు భీమా సౌకర్యం పొందలేకపోతున్నారని తెలిపారు అక్రమ రవాణాపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిటిఓ ను డిమాండ్ చేశారు.

## అమ్మవార్లకు ఘనంగా బోనాలు సమర్పణ



జనగామ టౌన్:నవంబర్:11(ఆకాంక్ష న్యూస్): జనగామ పట్టణంలోని11, 12వ వార్డు పరిధిలో ఉన్న వీవర్స్ కాలనీలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పోచమ్మ తల్లి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవార్లకు స్థానిక భక్తులు బోనాలను నైవేద్యంగా సమర్పించారు ముక్కులు చెల్లించుకున్నారు ఉత్సవాల్లో భాగంగా పోతరాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి అనంతరం అమ్మవారి ప్రాముఖ్యతను కథ రూపంలో వివరించారు ఈ కార్యక్రమంలో ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పదోన్నతిపై బదిలీ అయిన జడ్జికి ఘనంగా వీడ్కోలు



జనగామ టౌన్, నవంబర్ 11(ఆకాంక్ష న్యూస్): జనగామ సబ్ జడ్జి విక్రమ్ ఎడిజే గా హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టుకు బదిలీ కాగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు ముఖ్యఅతిథి జిల్లా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ విక్రమ్ సబ్ జడ్జిగా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లపై ఎంపీడీవోలు రోజు సమీక్ష చేయాలి

**- ఎంపీడీఓలు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడాలి**

**- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

రాజన్న సిరిసిల్ల, (ఆకాంక్ష న్యూస్) నవంబర్ 11 : జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై ఎంపీడీవోలు ప్రతి రోజు సమీక్ష చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులపై జిల్లాలోని జడ్పీ సీఈవో, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు ఇతర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, పీడీ హౌసింగ్ తో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

## ఐనవోలు పోలీసుల పనితీరు అభినందనీయం

**- ఐనవోలు ఎస్సై పి శ్రీనివాస్,పోలీస్ సిబ్బందికి ఘన సన్మానం**

**-సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత దొరికేనా పద్మ**





హనుమకొండ/ఐనవోలు ,నవంబర్ 11(ఆకాంక్ష న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణలో ఐనవోలు పోలీసుల అవిరామ కృషి, అంకితభావం, నిబద్ధత అభినందనీయం అని సావిత్రిబాయి పూలే అవార్డు గ్రహీత, తెలంగాణ మహిళా మండల ప్రెసిడెంట్ దొనికేనా పద్మ అన్నారు. హన్మకొండ జిల్లా ఐనవోలు పోలీస్ స్టేషన్ ను తెలంగాణ మహిళా మండలి బృందంతో కలిసి పద్మ సందర్శించి, ఎస్సై శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ తో పాటు సిబ్బందికి శాలువాలు కప్పి ప్రెసిడెంట్ దొనికేనా పద్మ,వైస్ ప్రెసిడెంట్ యాదుల్ హుస్సేన్ ఖురేషి, సెక్రటరీ ఫాతిమా బేగం,జాయింట్ సెక్రటరీ మహ్మద్ ఘనంగా సన్మానం చేసి అభినందించారు.అనంతరం పద్మను ఎస్సై,పోలీస్ సిబ్బంది సన్మానించారు.ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని, స్నేహ పూర్వక విధానాలతో పాటు అనేక కేసులను ఛేదించడంలో అత్యంత ఉద్యమ ప్రతిభను కనబరిచినందుకు దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలలో 78 పోలీసు స్టేషన్లను ఎంపిక చేయగా తెలంగాణలో రాష్ట్రం నుంచి ఎంపికైన మూడు పోలీస్ స్టేషన్లలో ఐనవోలు పోలీస్ స్టేషన్ ఎంపిక కావడం గర్వకారణం అన్నారు.

## కఠినమైన చట్టాలు వచ్చిన మహిళలకు రక్షణ కరువు

**- స్నానం చేస్తున్న మహిళ వీడియో తీసిన యువకుడు**

**- గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగింత**

**- పోలీసుల అదుపులో నిందితుడు**



భూపాలపల్లి/మొగుళ్ళపల్లి/నవంబర్ 11 (ఆకాంక్ష న్యూస్): రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ఎన్నో కఠినమైన చట్టాలు తెచ్చినప్పటికీ మహిళలకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోతుంది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా వావి వరుసలు మరిచి,సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్న కొందరు దుర్మార్గుల వల్ల ఆడపిల్లల భద్రతకు, భవిష్యత్తుకు రక్షణ కరువవుతుంది. ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులకు ఇలాంటి సంఘటనలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దుర్మార్గులుగా మారుతున్న వ్యక్తులు మన చట్టంలోని లోసుగులను వినియోగించుకుంటూ.. యథేచ్ఛగా తిరుగుతూ.. మహిళలపై దారుణాలకు ఒడిగడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ క్రమంలో మొగుళ్ళపల్లి మండలంలో ఒక దారుణం చోటు చేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది . ఎస్సై బోరగాల అశోక్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామంలో స్నానం చేస్తున్న మహిళా ఇంట్లోకి చొరబడి ఆమె బాత్ రూమ్ లో స్నానం చేస్తుండగా వీడియో తీసి..అసభ్యంగా ప్రవర్తించిన శ్రీపతి దిలీప్ అనే యువకుడిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోరగాల అశోక్ తెలిపారు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపింది. కాగా నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## అందెశ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి తీరని లోటు

**- నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్,**

**- బీసీ సెల్ అధ్యక్షులు గట్ల రమేష్**

(ఆకాంక్ష న్యూస్)



కోల్‌సిటి (గోదావరిఖని), నవంబర్ 11 : ప్రముఖ తెలంగాణ కవి రేడు అందె శ్రీ మరణం తెలంగాణ సాహిత్యానికి తీరని లోటని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్, రామగుండం బీసీ సెల్ అధ్యక్షులు గట్ల రమేష్‌లు అన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా లో మంగళవారం అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందెశ్రీ తెలంగాణ గీతంతో ప్రజల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించారని అన్నారు.ఆ గొంతు తెలంగాణ ఆవిర్భావానికి ప్రాణం పోసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎల్లప్పుడూ కళాకారులను, ప్రజల భావజాలాన్ని కాపాడుతుందన్నారు.అందె శ్రీ లేని లోటు తెలంగాణ సమాజంలోనే కాదు, యావత్ సాహిత్యలోకానికి తీరని లోటని అన్నారు. వారు ఏ లోకంలో ఉన్నా, వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మేయర్ బంగి అనిల్ కుమార్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, పాతపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజు, నాయకులు ఎండీ. ముస్తఫా, తిప్పారపు శ్రీనివాస్, ఈదునూరి హరిప్రసాద్, బొమ్మక రాజేష్, ధూళికట్ట సతీష్, కౌటం సతీష్, దాసరి సాంబమూర్తి, కొప్పుల శంకర్, బాలరాజ్ కుమార్, దొంత శ్రీనివాస్, పంజా శ్రీనివాస్, జెట్టి రమేష్, చెరుకు బుచ్చిరెడ్డి,ఇండ్ల ఓదెలు, కళ్యాణి సింహాచలం, కుంట సది, చొప్పరి శ్రీనివాస్, బూర్ల శ్రీనివాస్, మాలెం మధు, సమ్మెట స్వప్న, దొంతుల కిరణ్, ఆడెపు దశరథం, నాగభూషణం, గుండేటి శంకర్, సన్నీ భాయ్,కెంగర్ల కుమార్, ఫజల్ బేగ్, సిరాజ్, కనుకుంట్ల అశోక్,ఆడెపు రవి, పాతపెల్లి మల్లయ్య, అడప కృష్ణ, పులి రమేష్, సొల్లు రామస్వామి,తదితరులు పాల్గొన్నారు.



## మేజిక్ స్టార్ అవార్డు అందుకున్న కళ్యాణ్

**- ఆంధ్రప్రదేశ్‌లో ఘనంగా జరిగిన ఏపీఎంఏ 41వ మేజిక్ ఫెస్టివల్**

(ఆకాంక్ష న్యూస్)

వరంగల్, నవంబర్ 11 : ఆంధ్రప్రదేశ్ మెజీషి యన్స్ అసోసియేషన్ (ఏపీఎంఏ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆదివారం జరిగిన 41వ మేజిక్ ఫెస్టివల్ 'మాయాలోకం'లో వరంగల్ కు చెందిన ప్రముఖ మెజీషియన్, నేషనల్ అవార్డు విజేత శ్రీరాం కళ్యాణ్ 'మేజిక్ స్టార్' అవార్డుతో పాటు రూ.5,000 నగదు రివార్డును అందుకున్నారు. ఇంద్రజాల రంగంలో విశిష్ట సేవలందిస్తున్న వారికి ప్రముఖ మెజీషియన్ డా. బోస్ ప్రతి యేటా ప్రదానం చేసే ప్రతిష్టాత్మక 'మేజిక్ స్టార్' అవార్డుకు ఈ సంవత్సరం కళ్యాణ్ ను ఎంపిక చేసారు. కార్యక్రమంలో ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించి, అవార్డును, నగదును ప్రదానం చేసారు. మేజిక్ రంగానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డా. బోస్ మాట్లాడుతూ ఇప్పటినుంచి ఆయనను 'మేజిక్ స్టార్ కళ్యాణ్'గా పిలవాలని సూచించారు. అవార్డు స్వీకర్త శ్రీరాం కళ్యాణ్ మాట్లాడుతూ ఈ అవార్డుకు తనను ఎంపిక చేసిన డా. బోస్ కు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.వి.ఆర్, యు.పి. రాయుడు, డా.ఆర్యల్, డా.రమ్యశ్రీ, రఘుబాబు, విజయభాస్కర్ రెడ్డి, సృజన్ కుమార్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. మేజిక్ కళా రంగానికి సేవ చేయడానికి తన గురువు, సీనియర్ మెజీషియన్ దశరథ్, డా. బీఎన్ఎస్ కుమార్, తోటి మెజీషియన్లు నిరంతరం అందిస్తున్న ప్రోత్సాహం తనకు స్ఫూర్తినిస్తోందని కళ్యాణ్ పేర్కొన్నారు. కాగా ఈ వేడుకలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి దాదాపు 200 మంది ఇంద్రజాలికులు పాల్గొనగా, 20 మంది మెజీషియన్లు ఇంద్రజాల పోటీలో పాల్గొని తమ మాయాజాల ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. ఈ పోటీలకు కళ్యాణ్ న్యాయ నిర్ణేతగా కూడా వ్యవహరించారు.



## ఖనిలో పోలీసుల విస్తృత తనిఖీలు

(ఆకాంక్ష న్యూస్)

గోదావరిఖని టౌన్, నవంబర్ 11 : దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద సోమవారం జరిగిన పేలుళ్ల నేపథ్యంలో మంగళవారం గోదావరిఖని పట్టణంలో బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ తో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణంలో రద్దీగా ఉండే గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ప్రధాన చౌరస్తా, లక్ష్మీ నగర్, ఓల్డ్ అశోక్ టాకీస్, దుకాణాల సముదాయం, రామగుండం రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలలో ఆగిఉన్న కార్లను, ఇతర వాహనాలను డాగ్ స్క్వాడ్, బీడీ టీంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. అడుగడుగునా సోదాలు జరిపారు. ఈ సందర్భంగా గోదావరిఖని ఏసిపి మడత రమేష్ మాట్లాడుతూ దేశ రాజధాని డిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో రామగుండం సిపి ఆదేశాల మేరకు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో, రైల్వే స్టేషన్, బస్టాండ్ ఏరియాలలో బాంబు స్క్వాడ్, బీడీ టీమ్ తో తనిఖీలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని, మన ప్రాంతం చాలా సురక్షిత ప్రాంతమని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఈ తనిఖీలు చేయడం జరుగుతుందని, ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడ్డా, అనుమానిత వాహనాలను గుర్తించినా డయల్ 100 కు గానీ, సంబంధిత పోలీస్ స్టేషన్ లో గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. ఇంకా ఈ తనిఖీల్లో గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై అనూష, రమేష్, భూమేష్, బాంబ్ స్క్వాడ్ టీమ్ కొమురయ్య, అనిల్, రాజేష్, డాగ్ హ్యాండ్లర్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెం బిఆర్ఎస్‌లో పార్టీ పదవుల లొల్లి

### - మాజీ మంత్రికి తెలియకుండానే కమిటీలు - మాజీ మంత్రి వనమా అభ్యంతరం

(ఆకాంక్ష న్యూస్)



కొత్తగూడెం, నవంబర్ 11 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గం బిఆర్ఎస్ లో పార్టీ పదవుల లొల్లి మొదలైంది. మాజీ మంత్రి కొత్త గూడెం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావుకు తెలియకుండానే, ఆయన నియోజకవర్గంలో మూడు ప్రాంతాలకు మండల పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈ విషయం గురించి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నియామకాల గురించి చర్చించి, తన అభిప్రాయాన్ని చెప్పేందుకు మాజీ మంత్రి వనమా, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు కు ఫోన్ చేసినా, ఆయన ఫోన్ ఎత్తడం లేదని స్వయంగా మాజీ మంత్రి వనమా మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ పర్యవసానాన్ని బట్టి బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి వనమా సొంత నియోజకవర్గంలో ఆయన అభిప్రాయం తీసుకోకుండా, పార్టీ పదవుల్లో నియమించడం పార్టీలో అంతర్గత విభేదాలు బట్టబయలు చేస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వనమా విడుదల చేసిన ప్రకటన లో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం నియోజకవర్గంలో చుంచుపల్లి మండలం-1, చుంచుపల్లి మండలం-2 శాఖలకు మండల అధ్యక్షులను, సుజాత నగర్ మండలంకు నూతన అధ్యక్షులను బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కనీసం తనను సంప్రదించకుండా, కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జీగా ఉన్న తనకు కనీసం సమాచారం లేకుండా కమిటీలు ప్రకటించడాన్ని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. తన రాజకీయ జీవితంలో వార్డ్ మెంబర్ నుండి మంత్రిగా పనిచేసి, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన తను ఎప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడలేదని, పార్టీలో గ్రూప్ రాజకీయలు చేసి పార్టీ లో చిలిక తెచ్చే పనులు చేయలేదని పార్టీ క్యాడర్ ను అయోమయంకు గురి చేయలేదని, తెలంగాణ బాపు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలు తు.చా. తప్పకుండా పాటిస్తు కొత్తగూడెంకు నియోజకవర్గం లో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశానని వనమా పేర్కొన్నారు. తనను సంప్రదించ కుండా జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పదవులు పంపచం సరైన సంస్కృతి కాదని, జిల్లా అధ్యక్షుడు చేసిన ఈ పనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. పార్టీ అధిష్టానం దృష్టికి ఈ విషయం తీసుకు వెళ్తానని ఈ కమిటీలు రద్దు చేయించి, పార్టీ క్యాడర్ అభిష్టం మేరకు నూతన కమిటీలు వేస్తామని వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. సోషల్ మీడియాలో ఈ పదవుల వార్త చూసి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కు ఫోన్ చేయగా, రేగా కాంతారావు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని జిల్లా అధ్యక్షుడు ఇలా ఒంటెద్దు పోకడలకు పోయి పార్టీ క్యాడర్ లో చీలికలు తెస్తే పార్టీకి నష్టం జరిగుతుందని వనమా ఆవేదన వ్యక్తం చేశారు.

# మెరుగైన వైద్య సేవల కోసం ఆధునీకరణ చర్యలు అవసరం

### భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

(ఆకాంక్ష న్యూస్)



భద్రాద్రి-కొత్తగూడెం, నవంబర్ 11 : భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆధునీకరణ చర్యలు అత్యవసరమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన ఆధునీకరణ చర్యలు, సాంకేతిక పరిజ్ఞానం, వైద్య పరికరాల అవసరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆపరేషన్ థియేటర్ విభాగాన్ని పరిశీలించి, ఆధునీకరణ కోసం అవసరమైన అత్యాధునిక పరికరాలు, సాంకేతిక వినియోగం, ప్రస్తుత సదుపాయాల బలోపేతం వంటి అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బందితో చర్చించారు. ఆసుపత్రి భవనం పైభాగంలో నీటి లీకేజ్ సమస్యను గమనించిన కలెక్టర్, వెంటనే ఇంజనీరింగ్ అధికారులను పిలిచి లీకేజీ నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రసూతి విభాగం, శిశు సంరక్షణ విభాగం, అత్యవసర వైద్య విభాగం, వార్డులను సందర్శించి పరిశుభ్రత, వైద్య సదుపాయాలు, రోగుల సేవా ప్రమాణాలను కలెక్టర్ పరిశీలించారు. అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో కలెక్టర్ మాట్లాడుతూ, "ఆసుపత్రి ఆవరణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, పరిశుభ్రతలో నిర్లక్ష్యం చోటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, పరిశుభ్ర వాతావరణంలోనే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులు తప్పనిసరిగా యూనిఫార్మ్‌లు ధరించాలని, అవసరమైతే వారందరికీ యూనిఫార్మ్‌లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్య సిబ్బంది నర్సుల కొరతను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కొత్తగూడెం జిల్లా ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్) నుండి తాత్కాలికంగా నర్సులను నియమించడానికి అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న నర్స్ పోస్టులను భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కూడా తెలిపారు. ఇటీవల సిఎంఆర్ బృందం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అందిస్తున్న సేవలను ప్రశంసించిందని, ఈ విజయానికి కృషి చేసిన వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య సిబ్బందిని కలెక్టర్ అభినందించి సన్మానించారు. జిల్లా ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి ఆదర్శంగా నిలవాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఆధునీకరణ దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఓ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆరోగ్య విభాగాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి డ్రగ్స్ నిర్మూలనకు గళమెత్తిన జగద్గిరిగుట్ట వాసులు

### - ఎవరు గంజాయి అమ్మిన తాగిన గుట్ట నుంచి బహిష్కరిస్తాం

### - జిల్లా కార్యదర్శి మా మహేష్



(ఆకాంక్ష న్యూస్)

మేడ్చల్ మల్కాజిగిరి, నవంబర్ 11 : గంజాయిలేని సమాజం నిర్మిద్దామని జగద్గిరిగుట్ట కార్యాలయంలో జరిగిన సమావేశంలో జగదీగుట్ట అన్ని బస్తిల వాసులు, గంజాయిలేని సమాజం నిర్మిద్దామని జగద్గిరిగుట్ట కార్యాలయంలో జరిగిన సమావేశంలో జగదీగుట్ట అన్ని బస్తిల కమిటీల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు, హాజరై గంజాయి కి వ్యతిరేకంగా కలిసి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, బస్తి కమిటీల నాయకులు, ముక్తకంఠంతో జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో గంజాయి నిర్మూలన కోసం కలిసి పనిచేద్దామని, జగద్గిరిగుట్టలో గంజాయి అమ్మలనుకునే వారికి, సేవించాలనుకునే వారికి జగద్గిరిగుట్టలో కిరాయిలకు ఇవ్వద్దని, ఒకసారి గంజాయి కేసులో పట్టుబడితే జగద్గిరిగుట్ట నుండి బహిష్కరించాలని, అన్ని బస్తీలలో గంజాయి వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి బస్తీ ప్రజలను చైతన్యవంతం చేయాలని,నేడు జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అదేవిధంగా అన్ని రాజకీయ పార్టీలు బస్తీ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్టలో మానవహారాన్ని వేలాది మందితో ఏర్పాటు చేయాలని ఇది ఆరంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో గంజాయి రహిత సమాజం నిర్మించడం కోసం ప్రజలంతా ఏకం కావాలని గంజాయి వ్యతిరేక కమిటీ నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో నాయకులను ప్రవీణ్ ఆహ్వానించగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన సీనియర్ నాయకుడు యేసు, రత్నంమండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శిలు హరినాథ్, రాములు కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గణేష్, యువజన నాయకులు సాయి పంతుల, పవన్ రెడ్డి, జనసేన సతీష్, బిజెపిహనుమంతు చారి, రాజు యాదవ్, ప్రజానాట్యమండలి బాబు,ఏఐటీయూసీ శ్రీనివాస్, దుర్గయ్య, సదానంద, శ్రీనివాస్ నగర్ ఖయ్యూం,సీనియర్ జర్నలిస్ట్ తొండ వెంకట్, లెనిన్ నగర్ సదానందం, వనం రాజు, జీవి శ్రీనివాస్, రవీందర్ గౌడ్, మైసమ్మ నగర్ బసప్ప, రవి, రవీందర్ రెడ్డి బ్రహ్మానంద చారి,కృష్ణ గుడ్ మార్నింగ్ మురళి, సూరారం కాలనీ అధ్యక్షుడు సందీప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ త్రివేణి, విశ్వబ్రాహ్మణ సంఘం మనోహర్ చారి, దిన బందు కాలనీ ప్రవీణ్, అంజయ్య నగర్ వెంకటేష్, హెల్పింగ్ హాట్స్ హెల్పింగ్ హార్ట్స్ విజయ్, రాజు ఇమామ్ నరసింహ సామిల్ నరసింహారెడ్డి శ్రీనివాస్ సుంకిరెడ్డి అన్ని బస్తీల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పోలీస్ అధికారులు మొబైల్స్ చోరీ ముఠాలను గుర్తించాలి

### - జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల - చోరికి గురైన 71 సెల్ ఫోన్లను తిరిగి అప్పగించిన నిర్మల్ పోలీసులు




(ఆకాంక్ష న్యూస్)

నిర్మల్ నవంబర్ 11: నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఆదేశనుసారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నెల రోజుల్లో 71 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సి ఇ ఐ ఆర్వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సి ఇ ఐ ఆర్ వెబ్సైట్లో వినియోగదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1806 ఫోన్లు (సుమారుగా రెండు కోట్ల పదహారు లక్షల డెబ్బై రెండు వేల రూపాయల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వినియోగ దారులు,సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనేటప్పుడు అవి ఎక్కడి నుండి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరిచూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతేకాకుండా ఒకే వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్స్ దొరికితే, వారు ఏదైనా చోరీ ముఠా లేదా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని అడిషనల్ ఎస్పీకి ప్రత్యేక సూచనలు ఇచ్చారు. సిఇఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీచేయడంలో ప్రతిభకనబరిచిన ఐటి కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# నిర్లక్ష్యం చేస్తే ఎస్.సీ.ఆర్.పీ.లపై చర్యలు

### - భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

(ఆకాంక్ష న్యూస్)



భద్రాచలం, నవంబర్ 11 : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేయుచున్న ఎస్సిఆర్పీలు పనితీరు మెరుగుపరచుకొని తప్పనిసరిగా జిపిఎస్ పాఠశాలలను సందర్శించి ఉద్దీపకం వరకు బుక్ చదవడంలో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే ఎస్.సీ.ఆర్.పీ.లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం భద్రాచలం ఐటిడిఏ సమావేశం మందిరంలో జిపిఎస్ పాఠశాలల పనితీరుపై ఎస్.సీ.ఆర్.పీ.లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిపిఎస్ పాఠశాలల్లో చదివే చిన్నారుల విద్యాభ్యాసం మెరుగుపడడానికి ఉద్దీపకం వరకు బుక్ వన్, టు ప్రవేశ పెట్టడం జరిగిందని, కానీ కొన్ని పాఠశాలల్లో ఎస్సీ ఆర్పీల నిర్వహణ సరిగా లేకపోవడంతో పిల్లలు వెనుకబడి పోతున్నారని అన్నారు. జిపిఎస్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి లేకుండా ఎవరు సెలవులు పెట్టకూడదని, ఉపాధ్యాయులు ప్రతిరోజు పాఠశాలలకు వచ్చేలా చూడాలని అన్నారు. అశ్వరావుపేట బండారి గుంపు జిపిఎస్ పాఠశాలల్లో చదివే పిల్లలు బడికి రాకుండా పనులకు వెళ్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని పిల్లలందరూ సక్రమంగా బడికి రావాలని అవసరమైతే ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులను ఒప్పించి పిల్లలు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఇకనుంచి క్రమం తప్పకుండా జిపిఎస్ పాఠశాలలను తాను పరిశీలిస్తానని ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలు పిల్లలు సరిగా చెప్పకపోవడం, రాయకపోవడం చేయకపోతే ఆ ఉపాధ్యాయులపై శాఖపరమైన చర్యలతో పాటు సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఏసిఎంఓ రమేష్, ఏటీడీవోలు చంద్రమోహన్, భారతీదేవి, జిసిడిఓ అలివేలు మంగతాయారు, ఎస్.సీ.ఆర్.పీ.లు తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారమివ్వండి

### - భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

(ఆకాంక్ష న్యూస్)

భద్రాద్రి-కొత్తగూడెం, నవంబర్ 11:నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారమివ్వాలని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పిలుపునిచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు నవంబర్ 15 వరకు జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైతన్యం-డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమాలలో భాగంగా మంగళ వారం సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్ నుండి లక్ష్మీదేవిపల్లి, ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు భారీ బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, చైతన్యం అనే కార్యక్రమం ద్వారా నిషేదిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన యువత పడకుండా, వారికి అవగాహన కల్పించడం, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం నిరంతర తనిఖీలు చేపట్టడం వంటి కార్యక్రమాలను జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీ రోహిత్ రాజు జెండాను ఊపి బైకు ర్యాలీని ప్రారంభించారు. 1000 మందికి పైగా ఈ ర్యాలీలో స్థానికులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, కొత్తగూడెం టూ టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎఐ విద్యా బోధన ద్వారా విద్యార్థులలో మార్పుకు కృషి చేయాలి

### - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి

(ఆకాంక్ష న్యూస్)

ఆసిఫాబాద్, నవంబర్ 11 : విద్యా విధానంలో ఎఐ విద్యా బోధన ద్వారా విద్యార్థులలో మార్పు తీసుకొచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్చార్జి జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎఐ బోధన, విద్యార్థుల హాజరు శాతం పెంపుదల, నాణ్యమైన విద్య బోధన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా అందిస్తున్న బోధనలో విద్యార్థుల పురోగతి సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి రోజు విద్యార్థులను పర్యవేక్షించాలని, విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. ప్రశ్నలకు జవాబులు ఇవ్వడంలో తప్పులు చేస్తున్న విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. ఎ. ఐ. బోధన ద్వారా తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ సబ్జెక్టులలో విద్యార్థులు పురోగతి సాధించాలని, విద్యార్థులు పాఠశాలకు 100 శాతం హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

### - జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధిరె అశోక్

(ఆకాంక్ష న్యూస్)

ఆసిఫాబాద్, నవంబర్ 11 : ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అందిస్తున్న అవకాశా లను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధిరె అశోక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా పరిశ్రమల కేంద్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆర్.ఎ.ఎం.పి. పథకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేయబడుతున్న ప్రధానమంత్రి స్వనిధి పథకంపై అవగాహన కల్పించారు. ఆర్ఎఎంపి పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం యువతకు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవకాశాలను కల్పిస్తుందని, పథకం నిబంధనల ప్రకారం పరిశ్రమలను స్థాపించి అభివృద్ధి చెందాలని తెలిపారు. ప్రధానమంత్రి స్వయం ఉపాధి పథకం, విశ్వకర్మ, పిఎంఎఫ్ఎంఈ, టి-ప్రైడ్, టి-ఐడియా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, మెప్మా అధికారి మోతీరామ్, ఈడిసి మేనేజర్ నిఖిల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యవేక్షక బృందంలో పనిచేయటానికి దరఖాస్తు చేసుకోండి

### - భద్రాద్రి జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి

(ఆకాంక్ష న్యూస్)

పాల్వంచ, నవంబర్ 11 : భద్రాద్రి జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయడానికి తనిఖీ బృందాలను ఏర్పాటు చేయుటకు గాను డైరెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ వారి ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నామని జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీ బృందాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాథమిక స్థాయికి ఎనిమిది బృందాలు, ప్రాథమిక ఉన్నత స్థాయికి రెండు బృందాలు, ఉన్నత పాఠశాల స్థాయికి రెండు బృందాలు చొప్పున ఎన్నిక చేయవలసి ఉంటుంది. ఈ బృందంలో పనిచేయుటకు కనీసం 10 సంవత్సరాల బోధనానుభవం ఉండి, పాఠశాల అభివృద్ధికి దోహదపడుతూ, పాఠ్యాంశ బోధనలో వినూత్న పద్ధతులను ఆవలంబించే ఉత్సాహం ఉండి, నిరంతరం పాఠశాల పర్యవేక్షణ కొరకు జిల్లా మొత్తం తిరగటానికి ఆసక్తి ఉన్న ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవలసిందిగా డీఈవో తెలిపారు. ఈ బృందంలో పనిచేయు టకు ఇద్దరు గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున 16 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు, 10 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు, 18 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు కావలసి ఉంటుందని ఆమె తెలిపారు. ఆసక్తిగల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ నెల 15లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించ వలసిందిగా డీఈవో తెలిపారు.

# ఆరోగ్యం



## ఓట్స్ అధికంగా తింటే అనర్ధాలు.. జాగ్రత్త!

ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం.ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.

**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉ ంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

## పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే

పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.



తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉ ంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

## రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

### పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.

## ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

### మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే

మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకవైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గు బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.



రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరపప్పు, అరకప్పు సగ్గుబియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండల్లేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి.

10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి. అంతే రాగి పిండి సగ్గుబియ్యం కిచిడి రెడీ.


# సినిమా న్యూస్

## హీరోయిన్స్ నిజంగానే ఆ మందులు వాడుతారా...?


బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్... ఇలా ఏ సినిమా ఇండస్ట్రీ తీసుకున్న హీరోయిన్స్ చాలా మంది సన్నగా నాజూకుగా కనిపిస్తూ ఉంటారు. అతి తక్కువ మంది మాత్రమే హీరోయిన్స్ లావుగా కనిపిస్తూ ఉంటారు. సాధారణంగా బరువు ఎక్కువ ఉన్న హీరోయిన్స్‌కి ఇండస్ట్రీలో గుర్తింపు తక్కువగా ఉంటుంది. అంతే కాకుండా స్టార్ హీరోయిన్స్ వారిని దూరంగా పెడుతూ ఉంటారు. కొన్ని ప్రత్యేకమైన పాత్రలకు మాత్రమే బరువు ఎక్కువ ఉన్న హీరోయిన్స్‌ను తీసుకోవడం మనం చూస్తూ ఉంటాం. ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు హీరోయిన్స్ విషయంలో ప్రేక్షకులు, ఫిల్మ్ మేకర్స్ చాలా ప్రత్యేక శ్రద్దను కనబర్చుతూ ఉన్నారు. హీరోయిన్ అంటే సన్నగా ఉండాల్సిందే అనే ఒక రూల్‌ను అనధికారికంగా తీసుకు వచ్చారు. అందుకే దాదాపు అందరు హీరోయిన్స్ జీరో సైతం కోసం ఏదో ఒక రకంగా ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు అనేది వాస్తవం. ఈ మధ్య కాలంలో హీరోయిన్స్ బరువు తగ్గడం కోసం ఏకంగా ఆపరేషన్‌లు చేయించుకుంటున్నారు అనే పుకార్లు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా చాలా మంది హీరోయిన్స్ ముందస్తు జాగ్రత్తగా బరువు పెరగకుండా మందులు వాడుతున్నారు అనేది కొందరి వాదన. ఇండస్ట్రీలో ఉన్న చాలా మంది హీరోయిన్స్‌లో ముఖ్యంగా మూడు పదుల వయసు దాటిన హీరోయిన్స్‌లో కొద్ది మంది మందులు వాడుతూ బరువు పెరగకుండా జాగ్రత్త పడుతున్నారు అనేది చాలా మంది అభిప్రాయం. కొందరి పేర్లు కూడా ప్రచారం జరుగుతున్నాయి. సౌత్ సినిమాలతో పరిచయం అయ్యి, బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ఈ మధ్య కాలంలో ఆ ప్రచారం ఎక్కువగా జరుగుతూ ఉంది. ఆమె అభిమానులు తమన్నాను నేచురల్ బ్యూటీ అంటారు. కానీ కొందరు సోషల్ మీడియాలో మాత్రం పుకార్లు పుట్టిస్తున్నారు. తమన్నా విషయంలో మీడియాలో పుకార్లు.. సన్నగా ఉండటం కోసం మందులు వాడుతున్నారు అంటూ వస్తున్న పుకార్లపై తమన్నా క్లారిటీ ఇచ్చింది. ఇటీవల ఒక నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మీరు బరువు పెరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారా, మందులు వాడుతూ బరువు తగ్గే



ప్రయత్నం చేస్తున్నారా, మందులు వాడటం ద్వారా బరువు పెరగకుండా ఉంటున్నారా అన్నట్లుగా ప్రశ్నించారు. అందుకు తమన్నా కాస్త ఘాటుగానే స్పందించింది. తనను గత ఇరవై ఏళ్లుగా ప్రేక్షకులు చూస్తూనే ఉన్నారు. నాకు 15 ఏళ్లు ఉన్నప్పటి నుంచి ఇండస్ట్రీలో ఉన్నాను. నాలో వచ్చిన మార్పును ఎప్పటికప్పుడు ప్రేక్షకులు చూస్తూనే ఉన్నారు. ఎప్పుడూ మార్పు వచ్చినా అది సహజ సిద్దంగానే తప్ప నేను ఎప్పుడూ ప్రత్యేకంగా మార్పులు చేయించుకున్నది లేదు అన్నట్లుగా తమన్నా చెప్పుకొచ్చింది. తాను ప్రతి విషయంలోనూ సహజంగానే ఉండేందుకు ప్రయత్నిస్తాను అంది.




## నటి కష్టం.. ఓ వైపు థెరపీ.. ఇంకో వైపు సన్నివేశాల చిత్రీకరణ !



విక్రాంత్ కథానాయకుడిగా, చాందిని చౌదరి కథానాయికగా నటించిన సంతాన ప్రాప్తిరస్తు ఈనెల 14న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్‌లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్విప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ సినిమాకు సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించాడు. ఈ సినిమా టీజర్ , ట్రైలర్‌కు ఇప్పటికే అద్భుత స్పందన వచ్చింది. సోమవారం సాయంత్రం ప్రీరిలీజ్ వేడుకలో చిత్రబృందం సందడి చేసింది. ఈ వేడుక ఆద్యంతం తెలుగమ్మాయి చాందిని చౌదరి ప్రత్యేక ఆకర్షణగా మారారు. ఈ సినిమా టీమ్ ని విష్ చేసేందుకు దర్శకరచయిత మచ్చ రవి, దర్శకుడు బాబి తదితరులు పాల్గొన్నారు. ఈ వేదికపై మచ్చ రవి మాట్లాడుతూ.. నటి చాందిని చౌదరి చాలా మంది తెలుగమ్మాయిలు సినీరంగంలోకి రావడానికి స్ఫూర్తినిచ్చారని ప్రశంసించారు. చాందిని ఇన్ని సంవత్సరాలుగా ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం గొప్ప విషయమని అన్నారు. తెలుగమ్మాయిలు సినీరంగానికి రావాలంటే భయపడతారు. కానీ చాందిని నటనా రంగంలో నిరూపించుకున్నారు. కెరీర్ లో తను మంచి సినిమాలు చేసారు. కలర్ ఫోటో తర్వాత సంతాన ప్రాస్తిరస్తు.. మంచి పేరు తెచ్చే సినిమా అని అన్నారు. ఈ సినిమాలో పిల్లల్ని కనాలంటే ఎలా స్ట్రెస్ ఫ్రీ లైఫ్ లో ఉండాలో చెప్పిన సాధువు పాత్ర లో వెన్నెల కిషోర్ అద్భుతంగా నటించారని కూడా తెలిపారు. ఇక ఇదే వేదికపై నిర్మాతలు మాట్లాడుతూ.. చాందిని చౌదరి షూటింగ్ సమయంలో కొన్ని ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొన్నారని తెలిపారు. ఓవైపు సెట్లో తనకు థెరపీ జరుగుతుంటే, మరోవైపు సన్నివేశాల చిత్రీకరణ జరిగిందని, బాధతో ఉన్నా కానీ, తన సీన్ కోసం వచ్చి చాందిని చాలా శ్రమించారని తెలిపారు. ఈ సినిమా కథానాయకుడు విక్రాంత్ అమెరికాలో విజయవంతమైన టెకీ. ఆయన సాఫ్ట్ వేర్ కంపెనీలను నడిపిస్తున్నారు. అయితే వాటిని వదిలేసి ఇక్కడ హీరోగాను రాణిస్తున్నారని కితాబిచ్చారు. ఈ సినిమాలో అద్భుతంగా నటించిన చాందిని చౌదరి, విక్రాంత్ తదితరులకు మధురా శ్రీధర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సంతాన ప్రాప్తిరస్తు విజువల్స్ చూసాక అందరూ చప్పట్లు కొడుతుంటే విజయం సాధించిన ఆనందం కలుగుతోందని నిర్వి ప్రసాద్ అన్నారు. ఎంత బడ్జెట్ అయినా ఫర్వాలేదు.. పెద్ద బడ్జెట్ పెట్టాలనుకున్నాం.. కానీ చిన్న బడ్జెట్ అయినా.. తప్పక సూపర్ సక్సెస్ సాధించే సినిమా తీసామని తెలిపారు. ఈ చిత్రంలో విక్రాంత్, చాందిని అద్భుతంగా నటించారని తెలిపారు. చైతన్య, కళ్యాణి పాత్రలు అద్భుతంగా పండాయని అన్నారు.

## రాజకీయాలా? సినిమాలా? కంగనా ఆన్సర్ ఏంటంటే



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ సోషల్ మీడియాలో ఉంటూ ఎప్పుడూ ఏదొక వ్యాఖ్యలు చేస్తూ ఏదొక రూపంలో వార్తల్లో నిలుస్తూ ఉంటారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే కంగనా రెగ్యులర్ గా ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటూ తన అభిప్రాయాలను షేర్ చేసుకుంటూ ఉంటారు. అందులో భాగంగానే కంగనా చేసే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారతాయి. కాగా కంగనా తాజాగా ఫ్యాన్స్ తో ఇంటరాక్ట్ అవుతూ చాట్ సెషన్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా కంగనాకు ఆమె ఫ్యాన్స్ నుంచి రకరకాల ప్రశ్నలు ఎదురయ్యాయి. చాట్ సెషన్ లో భాగంగా ఓ నెటిజన్ మీకు పాలిటిక్స్ ఇష్టమా? సినిమాలు ఇష్టమా అని అడగ్గా, ఆ రెండింటిలో ఒకదాన్ని సెలెక్ట్ చేసుకోలేనని, ప్రస్తుతం రెండూ తనకు సమాన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని చెప్పారు. అభిరుచులు మారుతూ ఉంటాయి కాలంతో పాటూ మన అభిరుచులు కూడా మారుతాయని, ప్రస్తుతం తన దృష్టి క్రియేటివ్ మరియు పాలిటిక్స్ పై ఉందని, మనిషి లైఫ్ లో ఓ విషయంలో మాత్రమే నచ్చాల్సిన పన్లేదని, ప్రతీ దాంట్లో నేర్చుకునే విషయముంటుందని, తనకు రాజకీయాలూ, సినిమాలూ రెండూ ఇష్టమేనని చాలా క్లియర్ గా చెప్పారు. మరొకర నెటిజన్ నెక్ట్స్ మూవీ గురించి అడగ్గా దానికి సమాధానమిచ్చారు కంగనా. ప్రస్తుతం ఓ కథపై వర్క్ జరుగుతుందని చెప్పిన కంగనా, నెక్ట్స్ ఇయర్ లో ఆ మూవీ షూటింగ్ మొదలవనుందని చెప్పారు. అయితే ఆ సినిమాలో కంగనా నటిస్తున్నారా లేకా ఆ సినిమా కంగనా దర్శకత్వంలో వస్తుందా అనే విషయంలో మాత్రం కంగనా క్లారిటీ ఇవ్వలేదు కానీ ఓ ప్రాజెక్టుపై మాత్రం తాను వర్క్ చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా తన పెళ్లి గురించి చాలా కాలంగా వస్తున్న రూమర్లపై కూడా ఆమె స్పందించారు. తన పెళ్లి గురించి ఎన్నో వార్తలు విన్నానని, కానీ వాటిలో ఏ మాత్రం నిజం లేదని, పెళ్లి చేసుకోవడం, పిల్లల్ని కనడంపై తనకు ఇంట్రెస్ట్ లేదని, అలాంటి విషయాలు తనకు సూట్ అవవని క్లారిటీ ఇచ్చారు.

## బ్లాక్ లో కలర్‌ఫుల్‌గా ముద్దుగుమ్మ

రవితేజ హీరోగా వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే. మొదటి సినిమా కమర్షియల్‌గా డిజాస్టర్‌ను చవిచూసిన భాగ్యశ్రీ ఇండస్ట్రీలో ముందు ముందు ఆఫర్లు దక్కించుకుంటుందా అని అంతా అనుమానం వ్యక్తం చేశారు. కానీ ఈ అమ్మడికి టాలీవుడ్‌లో మంచి ఫ్యూచర్ ఉందని కొందరు మిస్టర్ బచ్చన్ విడుదలకు ముందే ఊహించారు. ఆమె లుక్ పరంగా ఆకట్టుకోవడంతో పాటు, తనలోని తెలియని ఆకర్షణతో ఇండస్ట్రీని తనవైపు తిప్పుకుంటుందని అంతా భావించారు. అన్నట్లుగానే మిస్టర్ బచ్చన్ ఫ్లాప్ అయినా కూడా అంచనాలను తారు మారు చేసి కొత్త ఆఫర్లను సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు, నటనతోనూ మెప్పించడం ద్వారా ఈ అమ్మడికి ఇండస్ట్రీలో వరుస ఆఫర్లు తలుపు తడుతూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. ఆంధ్రా కింగ్ తాలూక మూవీ... ఈ ఏడాదిలో రామ్ హీరోగా రూపొందిన ఆంధ్రా కింగ్ తాలూక సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. రవితేజతో ఆ సమయంలో ఆకట్టుకున్న ఈ అమ్మడు ఇప్పుడు రామ్ కు జోడీగా కూడా చూడముచ్చటగా ఉంది అనిపించుకుంటుంది. అందుకే ఆంధ్రా కింగ్ తాలూక సినిమా తర్వాత మరిన్ని ఆఫర్లు ఈ అమ్మడు అందుకుంటుంది అనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు రామ్ తో ఈ సినిమాలో నటిస్తూనే మరో వైపు తమిళ్ లో కాంతా సినిమాలో నటిస్తోంది. దుల్కర్ సల్మాన్ హీరోగా రూపొందుతున్న ఆ సినిమాలో హీరోయిన్‌గా ఈ అమ్మడు నటించడం ద్వారా అక్కడ కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు, ఈ రెండు సినిమాల్లో నటనతో మెప్పిస్తే తప్పకుండా ఈ అమ్మడు పాన్ ఇండియా రేంజ్ లో వరుస విజయాలు దక్కించుకునే



అవకాశాలు ఉన్నాయి. విజయ్ దేవరకొండతో భాగ్యశ్రీ బోర్సే... ఈ ఏడాదిలో ఇప్పటికే విజయ్ దేవరకొండతో కలిసి కింగ్‌డమ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు మరిన్ని సినిమా ఆఫర్లు వచ్చినా కూడా సున్నితంగా తిరస్కరిస్తూ వచ్చింది.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com